భోజ్‌పురి నటుడిపై తల్లి పోటీ?

పాట్నా, మే 15: భోజ్‌పురి సూపర్ స్టార్ పవన్ సింగ్ తల్లి ప్రతిమా దేవి బీహార్‌లోని కారాకాట్ లోక్‌సభకు మంగళవారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. బీజేపీ సభ్యుడైన తన కుమారుడు పోటీ నుంచి తప్పుకునే అవకాశాలు ఉండటంతో ఆమె స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారని కొందరంటుండగా, కొడుకుతో ఢీకొనేందుకే ఆమె పోటీ చేస్తున్నారని మరికొందరు ప్రచారం చేస్తున్నారు. అయితే తల్లీ కొడుకులిద్దరూ బరిలో ఉంటే ఎన్నికలు రసవత్తరంగా జరిగే అవకాశాలున్నాయి. కాగా, ఈ ఎన్నికల్లో బెంగాల్‌లోని అసన్‌సోల్ బీజేపీ టికెట్‌ను తిరస్కరించిన పవన్ సింగ్ తన సొంత రాష్ట్రమైన బీహార్‌లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించి నామినేషన్ వేశారు.

ప్రతిమా దేవి

ముంబైలో 'సేన'ల సవాల్

- గతంలో శివసేనకు కంచుకోటగా నగరం
- పార్టీ చీలికతో ఈసారి సేన వర్సెస్ సేన
- ఉద్ధవ్ ఠాక్రేకు కలిసొస్తున్న సానుభూతి
- మహారాష్ట్ర సీఎం షిండేకు అసలైన అగ్నిపరీక్ష

ముంబై, మే 15: దేశ ఆర్థిక రాజధాని ముంబై నగరం శివసేనకు కంచుకోట లాంటిది. గత మూడు దశాబ్దాలుగా ఎన్నిక ఏదైనా ముంబై నగరంలో శివసేన బలమైన ప్రభావం చూపిస్తూ వస్తున్నది. మరాఠా అనుకూల భావజాలంతో నగరంలో ఆ పార్టీ బలమైన ఓటుబ్యాంకును సృష్టించుకున్నది. అయితే, 2022 జూన్‌లో శివసేన పార్టీ నిట్ట నిలువునా చీలిపోవడంతో ఇప్పుడు ముంబై రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. పార్టీలో చీలిక తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నికలు ఇవి. పార్టీని చీల్చి ఎన్నికల సంఘం నుంచి అసలైన శివసేనగా గుర్తింపు పొందగలిగిన ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని పార్టీకి ముంబై నగరంలో లోక్‌సభ ఎన్నికలు అగ్నిపరీక్షగా మారాయి. మరోవైపు ముంబైవాసుల్లో తమకే ఆదరణ ఉన్నదని నిరూపించుకోవాల్సిన జీవన్మరణ సమస్యగా ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేనకు(ఉద్ధవ్) ఈ ఎన్నికలు మారాయి. పేరుకు మహా వికాస్ అఘాఢీ(ఇండియా కూటమి), మహాయుతి(ఎన్డీఏ) కూటముల మధ్యే పోరు అయినప్పటికీ ముంబై నగరంలో మాత్రం రెండు శివసేనల మధ్యనే అసలుసిసలు పోటీ నెలకొన్నది.

గత రెండు ఎన్నికల్లో ఎన్డీయే క్లీన్‌స్వీప్

ముంబై నగరం విస్తరించి ఉన్న ముంబై మెట్రోపాలిటన్ రీజియన్(ఎంఎంఆర్) పరిధిలో 10 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. వీటిల్లో కల్యాణ్, థానే, ముంబై వాయువ్య, ముంబై దక్షిణ మధ్య, ముంబై దక్షిణ స్థానాల్లో శివసేన(షిండే), శివసేన(ఉద్ధవ్) పరస్పరం తలపడుతున్నాయి. పాల్ఘర్, ముంబై ఈశాన్య, ముంబై ఉత్తర మధ్య స్థానాల్లో బీజేపీ, శివసేన(ఉద్ధవ్) పోటీ పడుతున్నాయి. భీవండిలో బీజేపీ, ఎన్సీపీ మధ్య, ముంబై ఉత్తర స్థానంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ నెలకొన్నది. గత రెండు ఎన్నికల్లోనూ ఈ పది స్థానాలను అవిభాజ్య శివసేన, బీజేపీతో కూడిన ఎన్డీయే కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. 2014లో బీజేపీ 5, శివసేన 5, 2019లో బీజేపీ 4, శివసేన 6 స్థానాలను గెలుచుకున్నాయి. ఈసారి మాత్రం శివసేన ఓటుబ్యాంకు ఏక్‌నాథ్ షిండే వైపు ఉంటుందా? ఉద్ధవ్ ఠాక్రే వైపు ర్యాలీ అవుతుందా? అనే అంశంపై ముంబైలోని 10 స్థానాల్లో గెలుపోటములు ఆధారపడి ఉన్నాయి.

రెండు శివసేనలకు సవాల్‌గా ఐదు స్థానాలు

మొత్తం 10 స్థానాల్లోనూ గెలుపోటములను నిర్ణయించడంలో శివసేన ఓటుబ్యాంకే కీలకమైనప్పటికీ శివసేన(షిండే), శివసేన(ఉద్ధవ్) మధ్య హోరాహోరీ పోరు నెలకొన్న ఐదు స్థానాల్లో ఎవరు గెలుస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇందులో థానే జిల్లా ఇప్పటివరకు ఏక్‌నాథ్ షిండేకు బలమైన ప్రాంతంగా ఉండేది. థానే జిల్లా గతంలో దివంగత శివసేన నేత, ధర్మవీర్‌గా ప్రాచుర్యం పొందిన ఆనంద్ దిఘేకు కంచుకోట. ఆయన ఉన్నప్పుడు ఇక్కడ బాల్‌ఠాక్రే జోక్యం కూడా ఉండేది కాదు. ఆనంద్ దిఘే మరణం తర్వాత ఆయన శిష్యుడైన ఏక్‌నాథ్ షిండే థానేలో పట్టు నిలుపుకుంటూ వచ్చారు. శివసేన(షిండే) కార్యాలయం కూడా థానేలోని ఆనంద్ దిఘే నివాసంలోనే ఉంది. గత రెండు ఎన్నికల్లోనూ థానే జిల్లాలోని కల్యాణ్ స్థానం నుంచి ఏక్‌నాథ్ కుమారుడు శ్రీకాంత్ షిండే భారీ మెజారిటీతో గెలిచి ఇప్పుడు మూడోసారి బరిలో నిలిచారు. కల్యాణ్, థానే స్థానాలను తిరిగి గెలిపించుకొని తన సొంత ప్రాంతంలో ఏక్‌నాథ్ పట్టు నిలుపుకుంటారా అనేది ఆసక్తికరంగా మారింది. ఇక, ముంబై వాయువ్య, ముంబై దక్షిణ మధ్య, ముంబై దక్షిణ స్థానాల్లో శివసేన(ఉద్ధవ్)కి బలమున్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఎన్డీయేను దెబ్బ తీస్తున్న ఉద్ధవ్‌పై సానుభూతి

ఎన్డీయే తిరిగి అధికారంలోకి రావాలన్నా, గత ఎన్నికల్లో సాధించిన స్థానాల సంఖ్యను నిలుపుకోవాలన్నా ముంబై నగరం చాలా కీలకం. అయితే, శివసేన పార్టీని చీల్చడం, ఉద్ధవ్ ఠాక్రేని ముఖ్యమంత్రి పదవి నుంచి దించేయడం ఎన్డీయే విజయావకాశాలను ఈసారి దెబ్బతీసే అవకాశం ఉంది. ముఖ్యంగా, ముంబై ఓటర్లలో ఉద్ధవ్‌పై సానుభూతి ఉన్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నగరంలో శివసేనకు ఉన్న బలమైన ఓటుబ్యాంకు కూడా మెజారిటీ ఉద్ధవ్ వెంటే ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇదే జరిగితే ఈసారి ఎన్డీయేకు ఈ 10 స్థానాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉండొచ్చు. అయితే, హిందూ భావజాలం కలిగిన శివసేన.. ఇండియా కూటమిలో కలవడం పట్ల ఉద్ధవ్ తీరుపై శివసేన ఓటుబ్యాంకులో కొంత అసంతృప్తి ఉందనే వాదన కూడా ఉంది. గత రెండు ఎన్నికల్లోనూ ఈ 10 స్థానాల్లో ఎన్డీయే భారీ మెజారిటీలు దక్కించుకుంది. ఈసారి మాత్రం మహా వికాస్ అఘాఢీ నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటున్నది.

జార్ఖండ్ మంత్రి ఆలంగీర్ ఆలం అరెస్టు

నోట్ల కట్టల కేసులో కస్టడీలోకి తీసుకొన్న ఈడీ

రాంచీ, మే 15: మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, కాంగ్రెస్ నేత ఆలంగిర్ ఆలంను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బుధవారం అరెస్టు చేసింది. పీఎంఎల్‌ఏ కింద ఆయన్ను కస్టడీలోకి తీసుకొన్నట్టు ఈడీ వర్గాలు తెలిపాయి. బుధవారం దాదాపు 6 గంటల పాటు ప్రశ్నించిన అనంతరం అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకొన్నారు. ఈడీ గత వారం ఓ ఫ్లాట్‌లో రూ.32 కోట్లకు పైగా లెక్కచూపని నగదును స్వాధీనం చేసుకొన్న విషయం తెలిసిందే. తర్వాత దీనికి సంబంధించి మంత్రి ఆలంగిర్ వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ కుమార్ లాల్, సంజీవ్ ఇంట్లో పని చేసే జహంగీర్‌ను అరెస్టు చేసింది.

'గర్భస్థ శిశువుకూ జీవించే హక్కుంది'

న్యూఢిల్లీ, మే 15: గర్భ విచ్ఛిత్తిపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం ప్రకటించింది. 20 ఏండ్ల పెండ్లికాని యువతి 27 వారాల గర్భ విచ్ఛిత్తికి అనుమతి నిరాకరిస్తూ.. గర్భంలోని శిశువుకు సైతం జీవించే హక్కు ఉందని స్పష్టం చేసింది. గర్భం తొలగించుకోవడానికి అనుమతి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు మే 9న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఒక యువతి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలో జస్టిస్‌లు ఎస్ వీఎన్ భట్టీ, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారించింది. గర్భంలోని శిశువుకు కూడా జీవించే ప్రాథమిక హక్కు ఉంది.

ఎన్‌డీఏ, ఎన్‌ఏ-2 దరఖాస్తులు ప్రారంభం

న్యూఢిల్లీ: నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ(ఎన్‌డీఏ, ఎన్‌ఏ 2)-2024 పరీక్ష ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం ప్రారంభించింది. అర్హులైన అభ్యర్థులు యూపీఎస్సీ వెబ్‌సైట్ upsc.gov.inలో అందుబాటులో ఉండే ఓటీఆర్ వేదికపై రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపింది. ఈ ఏడాది రెండో సెషన్‌లో భాగంగా ఎన్‌డీఏ 370, ఎన్‌ఏ 34 ఉద్యోగాలకు మొత్తంగా 404 ఖాళీలకు సంబంధించి ఉద్యోగ ప్రకటన విడుదలైంది.

గూగుల్ 'ప్రాజెక్ట్ అస్త్ర'

త్వరలో అందుబాటులోకి మల్టీమాడల్ ఏఐ అసిస్టెంట్

న్యూయార్క్, మే 15: 'ప్రాజెక్ట్ అస్త్ర' పేరుతో కొత్త మల్టీమాడల్ కృత్రిమ మేధ(ఏఐ) అసిస్టెంట్‌ను గూగుల్ పరిచయం చేసింది. ఈ కొత్త ఏఐ అసిస్టెంట్‌ను మనం టెక్ట్స్, ఆడియో, వీడియో ద్వారా ప్రశ్నలు అడగొచ్చు. ఈ ప్రశ్నలకు రియల్ టైమ్‌లో అప్పటికప్పుడే ఇది సమాధానాలు ఇస్తుంది. గదిలోని వస్తువులను కూడా ఇది గుర్తిస్తుంది. కిటికీ బయటకు చూసి అది ఏ ప్రదేశమో చెప్పేస్తుంది. వస్తువులు ఎక్కడున్నాయో పసిగడుతుంది. అనేక పనులను చేయగలిగే ఈ ఏఐ అసిస్టెంట్‌లోని ఫీచర్లను పరిచయం చేస్తూ గూగుల్ ఒక డెమో వీడియోను విడుదల చేసింది. దీనిని స్మార్ట్‌ఫోన్, స్మార్ట్‌గ్లాసెస్ నుంచి కూడా వినియోగించుకోవచ్చని, జెమినీ యాప్‌తోనూ దీనిని అనుసంధానం చేయనున్నట్టు పేర్కొన్నది. ఈ కొత్త ఏఐ అసిస్టెంట్ గొంతును సహజసిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దినట్టు గూగుల్ తెలిపింది.

2029 వరకూ మోదీనే!

- ఆ తర్వాత కూడా ఆయనే
- అమిత్ షా పునరుద్ఘాటన
- '75 ఏండ్ల' రిటైర్మెంట్ రూల్ మోదీకి వర్తించదా? అని అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్న
- మోదీ వారసుడిపై ది ఎకానమిస్ట్‌లోనూ కథనం
- దీంతో బీజేపీ వర్గాల్లో పెద్దయెత్తున చర్చ
- ఈ క్రమంలోనే షా వివరణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): 2029 వరకూ మోదీనే ప్రధానిగా కొనసాగుతారని, ఆ తర్వాత కూడా తమను ఆయనే నడిపిస్తారని కేంద్రహోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. '75 ఏండ్ల రిటైర్మెంట్ నిబంధన మోదీకి వర్తించదా?' అంటూ ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఇటీవల ప్రశ్నించారు. మోదీ తర్వాత ఆయన వారసుడు ఎవరంటూ బ్రిటిష్ పత్రిక 'ది ఎకానమిస్ట్'లోనూ ఓ కథనం ప్రచురితమైంది. దీంతో మోదీనే తమ ప్రధాని అని, 2029 తర్వాత కూడా ఆయనే తమను నడిపిస్తారంటూ అమిత్ షా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

ప్రధానిగా నేనే ఉంటా..

75 ఏండ్లుపైబడిన వారిని రాజకీయాలకు దూరం చేయడమన్న నిబంధన బీజేపీలో అనధికారికంగా కొనసాగుతున్నది. బీజేపీ సీనియర్లు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషి, సుమిత్రా మహాజన్, యశ్వంత్ సిన్హాను వయసు ప్రాతిపదికన బలవంతంగా పక్కనపెట్టారు. త్వరలో మోదీకి 75 ఏండ్లు నిండబోతున్నాయి. దీంతో ఆయన కూడా రిటైర్మెంట్ తీసుకొంటారా? అంటూ విపక్ష పార్టీ నేతలతో పాటు అంతర్జాతీయ మీడియాలోనూ పెద్దయెత్తున కథనాలు వస్తున్నాయి. ఇదే విషయమై మోదీ ఇటీవల మాట్లాడుతూ.. 2029 వరకూ బీజేపీ నుంచి తానే ప్రధానిగా కొనసాగుతానని పరోక్షంగా హింట్ ఇచ్చారు. కాగా, మోదీ వారసుడిపై 'ది ఎకానమిస్ట్'లో ప్రచురితమైన కథనం బీజేపీలోని మోదీ వ్యతిరేకవర్గం పనేనన్న వార్తలు వినిపిస్తున్నాయి.

కేజ్రీవాల్‌కు 'స్పెషల్ ట్రీట్‌మెంట్'

- దేశంలో చాలామంది ఇదే నమ్ముతున్నారు
- ఆయనకు సాధారణంగా బెయిల్ రాలే: అమిత్ షా

న్యూఢిల్లీ, మే 15: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు కావడం పట్ల కేంద్రమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని తాను సాధారణంగా ఇచ్చిన తీర్పుగా చూడటం లేదని, దేశంలోని చాలామంది కేజ్రీవాల్‌కు 'స్పెషల్ ట్రీట్‌మెంట్' ఇచ్చినట్టుగా నమ్ముతున్నారని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఏఎన్ఐ ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు ఓట్లు వేస్తే మళ్లీ జైలుకు వెళ్లాల్సిన అవసరం ఉండదని కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు స్పష్టంగా కోర్టు ధిక్కారమని అన్నారు. అంటే, ఎవరైనా ఎన్నికల్లో గెలిస్తే తప్పు చేసినట్టు నిరూపితమైనా సుప్రీంకోర్టు జైలుకు పంపించదని ఆయన చెప్పడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కోర్టు తీర్పును కేజ్రీవాల్ ఎలా దుర్వినియోగం చేస్తున్నారనేది ఆయనకు బెయిల్ ఇచ్చిన న్యాయమూర్తులు ఆలోచించుకోవాలని అన్నారు.

'న్యూస్‌క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ అరెస్టు చెల్లదు

బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 15: ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద అరెస్టయిన 'న్యూస్‌క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ అరెస్టు చట్టప్రకారం చెల్లదని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఆయనను వెంటనే విడుదల చేయాలని బుధవారం ఆదేశించింది. తన అరెస్టు, రిమాండ్‌ను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేయడాన్ని సవాల్ చేస్తూ ప్రబీర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం.. ఢిల్లీ హైకోర్టు తీర్పును కొట్టేసింది. ప్రబీర్ పుర్కాయస్థకు బెయిల్ మంజూరు చేసింది.

25% ఫిరాయింపుదారులే

బీజేపీ అభ్యర్థుల్లో ప్రతి నలుగురిలో ఒకరు ఇతర పార్టీల నుంచి వచ్చినవారే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ప్రతీ నలుగురిలో ఒకరు ఇతర పార్టీ నుంచి వలస వచ్చినవారే. ఈ ఎన్నికల్లో బీజేపీ ఇప్పటివరకూ 435 మంది అభ్యర్థులను ప్రకటించగా.. అందులో 106 మంది (దాదాపు 25 శాతం) ఫిరాయింపుదారులే. ఈ మేరకు 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఓ కథనంలో వెల్లడించింది.



సీఏఏ ద్వారా తొలిసారి 14 మందికి పౌరసత్వం

సర్టిఫికెట్లు అందజేసిన కేంద్రహోంశాఖ

న్యూఢిల్లీ, మే 15: లోక్‌సభ ఎన్నికల వేళ పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలును కేంద్రం ప్రారంభించింది. సీఏఏ అమల్లోకి వచ్చిన తర్వాత తొలిసారిగా 14 మందికి భారత పౌరసత్వం కల్పించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా వారికి బుధవారం ఢిల్లీలో పౌరసత్వ సర్టిఫికెట్లను అందజేశారు. సంబంధిత పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రాసెస్ చేసిన తర్వాత, ఈ సర్టిఫికెట్లను మంజూరు చేశామని హోంశాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. సీఏఏ అమలుపై ఈ ఏడాది మార్చిలో కేంద్రం నోటిఫికేషన్ జారీచేసిన విషయం తెలిసిందే. 2014, డిసెంబర్ 31 కంటే ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్గానిస్థాన్‌ల నుంచి భారత్‌లోకి వచ్చిన ముస్లిమేతర(హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు, క్రిస్టియన్లు) వలసదారులకు పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిందే సీఏఏ. 2019, డిసెంబర్‌లో కేంద్రంలోని బీజేపీ సర్కార్ పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకొన్న ఈ చట్టాన్ని విపక్ష పార్టీలు, పలు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ చట్టం ముస్లింల పట్ల వివక్ష చూపిస్తున్నదని విమర్శిస్తున్నారు.

ఒత్తిడిలో మోదీ!

'ముస్లిం' వ్యాఖ్యలపై ప్రధాని యూటర్న్

- తాను అలా అనలేదంటూ వివరించే యత్నం
- మోదీ ముస్లిం వ్యాఖ్యలతో బీజేపీకి దెబ్బ?!
- మోదీపై అంతర్జాతీయ మీడియా కూడా గుర్రు
- ఈ క్రమంలోనే వ్యాఖ్యలపై వెనక్కితగ్గిన మోదీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): చొరబాటుదారులు, ఎక్కువ మంది పిల్లలను కనేవారంటూ ముస్లింలపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ప్రధాని మోదీ యూటర్న్ తీసుకొన్నారు. ముస్లింలను ఉద్దేశించి తాను ఆ వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఇలాంటి వాటిని ప్రచారం చేస్తూ ముస్లింలకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు న్యూస్ 18కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. అయితే, ముస్లిం వ్యాఖ్యలపై మోదీ ఇలా యూటర్న్ తీసుకోవడానికి ఆయన మీద ఒత్తిడి పెరుగడమే కారణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నష్టం జరుగకూడదనే

'విశ్వగురు' పేరిట ప్రచారం చేసుకొంటున్న మోదీ.. మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా ఇలాంటి వ్యాఖ్యలను చేయడం దేశంలోని ప్రధాన మీడియా సహా, న్యూయార్క్ టైమ్స్ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలు కూడా తప్పుబట్టాయి. దీంతో పాటు గడిచిన నాలుగు దఫాల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం భారీగా తగ్గింది. ఇది బీజేపీకి ఎదురు దెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి మోదీ వివాదాస్పద వ్యాఖ్యలే కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక, ముస్లింలపై విద్వేష వ్యాఖ్యలు చేసిన మోదీపై చర్యలు తీసుకోవాలని ఈసీపై విపక్షాలు ఒత్తిడి తీసుకొస్తున్నాయి. ఇదే విషయమై సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలైంది. 2002 గుజరాత్ అల్లర్ల ఘటనలో మోదీ పాత్రపై అనుమానాలతో అమెరికా, యూకే ఆయనకు ట్రావెల్ వీసాను గతంలో నిరాకరించాయి. ఇప్పుడు ఇలాంటి విద్వేష వ్యాఖ్యలతో తనకు మళ్లీ అలాంటి పరిస్థితి వచ్చే ప్రమాదమున్నదని మోదీ భావించి ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఆయన తన వ్యాఖ్యలపై పునరాలోచనలో పడ్డట్టు తెలుస్తున్నది. ఇలాంటి సమయంలో వివరణ ఇవ్వకపోతే పరిస్థితి చేజారవచ్చని మోదీ భావించి ఉండవచ్చని, ఈ క్రమంలోనే తన వ్యాఖ్యలపై యూటర్న్ తీసుకోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కలుపుకుపోతున్నట్టు కనికట్టు

ఎక్కడైనా తాను మాత్రమే హైలైట్ కావాలని ప్రధాని మోదీ కోరుకొంటారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే, మంగళవారం వారణాసి నుంచి మూడోసారి నామినేషన్ దాఖలు చేసిన ప్రధాని మోదీ.. ఎన్డీయే కూటమి నేతలతో, కేంద్రమంత్రులు, బీజేపీ సీఎంలతో బలప్రదర్శన చేశారు. అంతేకాదు.. తన నామినేషన్ ప్రపోజర్లలో ఒక బ్రాహ్మిన్, ఇద్దరు ఓబీసీలు, ఒక దళిత వ్యక్తి ఉండేలా చూసుకొన్నారు. అలా తాను అన్ని వర్గాలవారిని కలుపుకుపోతున్నట్టు కనికట్టు చేసే ప్రయత్నం చేశారు.

స్పామ్ కాల్స్‌కు ఇక స్వస్తి!

త్వరలో కేంద్రం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, మే 15: ఏదైనా పనిలో బిజీగా ఉన్న సమయంలో లోన్ కావాలా? క్రెడిట్ కార్డు కావాలా? ప్లాట్ కొంటారా? అంటూ ఒక్కోసారి పదేపదే కాల్స్ చేస్తూ తెగ విసిగిస్తుంటారు. ఈ స్పామ్ కాల్స్ సమస్యకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలో విడుదల చేయనున్నదని అధికారిక వర్గాలు తాజాగా వెల్లడించాయి. సంబంధిత ముసాయిదా గైడ్‌లైన్స్‌ను ట్రాయ్ ఇప్పటికే సిద్ధం చేసినట్టు తెలిపాయి. రిజిస్టర్ కాని మొబైల్ నంబర్లు, అన్‌వాంటెడ్ కాల్స్ నియంత్రణకు ఇందులో పలు సూచనలు చేసినట్టు పేర్కొన్నాయి. ట్రాయ్ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే టెలికం కంపెనీలు, సంస్థలు భారీ జరిమానాలు ఎదుర్కొనవలసి ఉంటుంది. కాల్స్‌ను గుర్తించడానికి టెలికం సంస్థలు వాటి ఐడెంటిటీని వెల్లడించాల్సి ఉంటుంది. ఇందుకు మూడు వేర్వేరు సిరీస్‌లను తీసుకురానున్నట్టు సమాచారం. మార్కెటింగ్ కాల్స్‌కు 140, సర్వీస్ కాల్స్‌కు 160, ప్రభుత్వ ఏజెన్సీల కమ్యూనికేషన్‌కు 111 ఇవ్వాలని యోచిస్తున్నట్టు తెలిసింది. టెలికం ఆపరేటర్లు ప్రతి కాలర్ పేరు, సెక్టార్‌తో సహా వెల్లడించాల్సి ఉంటుంది. దాన్ని బట్టి కాల్స్ లిఫ్ట్ చేయాలా వద్దా అన్నది యూజర్లు నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది.

చార్‌ధామ్ యాత్రలో భక్తుల పాట్లు

- భారీగా తరలిరావడంతో ట్రాఫిక్, ఇతరత్రా ఇబ్బందులు
- గంటల కొద్దీ వాహనాలు రోడ్లపైనే
- యాత్ర మధ్యలోనే భక్తులు వెనక్కి
- ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలం

ఉత్తరకాశి, మే 15: చార్‌ధామ్ యాత్రకు భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తుతున్నారు. దీంతో వారు ట్రాఫిక్, ఇతరత్రా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తగిన ఏర్పాట్లు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి. తాలిరోజున యమునోత్రికి దాదాపు 45 వేల మంది దర్శనానికి రావడంతో ఇరుకైన దారిలో నడిచేందుకు కూడా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం గంగోత్రి యాత్ర రూట్‌లో పెద్దయెత్తున ట్రాఫిక్ ఉంటున్నది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అధికారులు టూరిస్టు వాహనాలను పలుచోట్ల నిలిపివేస్తున్నారు. అయితే ఇది గంగోత్రి, యమునోత్రి హైవేలపై మరింత ట్రాఫిక్‌కు దారితీసింది. 15-20 వేల మంది భక్తులు కొన్ని గంటలపాటు తమ వాహనాల్లో చిక్కుకుపోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో చాలా మంది భక్తులు తమ చార్‌ధామ్ యాత్రను మధ్యలోనే ముగించుకొని తిరిగి వెనక్కు వెళ్లిపోతున్నారు. హైవేపై పలు పాయింట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడంతో గంగోత్రి చేరుకొనేందుకు 16-20 గంటల సమయం పడుతుందని కొంత మంది భక్తులు పేర్కొన్నారు. యమునోత్రి హైవేపై కూడా ఇదే పరిస్థితి ఉన్నదని చెప్పారు. రద్దీకి తగిన ఏర్పాట్లు చేయడంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం విఫలమైందని మహారాష్ట్రకు చెందిన అనిత అనే యాత్రికురాలు విమర్శించారు. ఎంతో ఖర్చు పెట్టుకొని యాత్రకు వచ్చి తీవ్ర నిరాశకు గురయ్యామని అన్నారు. కనీసం తాగునీరు, ఆహారం, టాయిలెట్లు వంటి మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని గుజరాత్‌కు చెందిన మనీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

60 రోజులు దాటినా అమెరికాలో ఉండొచ్చు

- ఉద్యోగాలు కోల్పోయిన హెచ్-1బీ వీసాదారులకు ఊరట
- వీసా స్టేటస్ మార్చుకుంటే సరిపోతుంది..
- అమెరికా ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ వెల్లడి

న్యూయార్క్, మే 15: అమెరికాలో హెచ్-1బీ వీసాపై పని చేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన వారికి యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) కాస్త ఉపశమనం కల్పించింది. ఉద్యోగం కోల్పోయిన 60 రోజుల్లో అమెరికాను వీడాలని అందరూ భావిస్తుంటారని, అలాంటి అవసరం లేదని పేర్కొన్నది. ఈ మేరకు